
# పుట్టలోని చెదలు...

## సుంకర వి. హనుమంతరావు



'కొడుకూ..కోడలు..' రెండేళ్ల మనుమడితో పాటు మనాలీ వెళ్లడంతో 'మనసు'కు ప్రశాంతత లభించినట్లు చిన్నగా నిట్టూర్చింది జయంతి. ద రిటైర్డ్ లెక్చరర్ ఆఫ్ ఆంధ్రమహిళాసభ కాలేజ్

వారం రోజులుగా ఒకే విషయం గురించి ఆలోచించీ.. ఆలోచించీ...పరిష్కారం దొరక్కపోవడంతో మానసికంగా చాలా అలసిపోయిందామె.

ఇంతేనా జీవితమంటే? ఏదో జరుగుతుందని... ఆశలతో అహర్నిశలు శ్రమతో నిర్మించుకున్న జీవిత సౌధం కేవలం ఒకే ఒక చిన్న వాక్యంతో బీటలు వారిపోయిందంటే తప్పు ఎవరిది?

తనదా? కన్న కొడుకుదా?

తను కూడా ఓ తల్లికి బిడ్డననే ఇంగిత జ్ఞానాన్ని కోల్పోయిన కోడలు రమ్యదా? భర్తను అదుపులో పెట్టుకోగలిగినంత మాత్రాన అందరి మీదా అధికారం వచ్చేసినట్లేనని భావించే కోడలు... చూపులకు మాత్రమే 'రమ్య'...ప్రవర్తనలో కానీ, పెట్టుపోతల్లో కానీ రమ్యత లేని ఆమె కా పేరెందుకు పెట్టారోనని... ఆమె తన ఇంట్లో అడుగు పెట్టినప్పటి నుండీ ఆలోచించని క్షణాలు 'చాలా అరుదు'.

అసలీ సంక్షోభానికి కారణం ఏమిటి?

తను భర్తను కోల్పోవడమా? జీవిత సౌఖ్యాలను వాయిదా వేసుకొని 'మనసుని శిలగా మార్చుకుని' కంటికి రెప్పలా మారి పిల్లల్నిపెంచి ప్రయోజకుల్ని చేయడమా?

ప్రయోజకులైన పిల్లలు తననేదో ఉద్ధరిస్తారనే అపోహల్ని ఆశలుగా మలుచుకోవడమా?

ఒంటరిగా బతుకు బండిని ఈడ్చలేనేమోనని 'కొడుకుని, కోడలిని' తనతో వుంచుకోవడమా? ఇన్ని ఆలోచనల మధ్య వారం క్రితం జరిగిన ' ఆ సంఘటన' ఆమె మనసును పచ్చి పుండులా సలుపుతుంటే..బాధను భరించడం కోసం...కళ్లు మూసుకున్న జయంతికి కనురెప్పల మధ్య 'కలికం' పెట్టినట్లు మెదిలింది.

***

ఆ రోజు సాయంత్రం ఆఫీసు నుంచి వ


స్తూనే చిన్నగా గీరుకుపోయిన బాబీగాడి చేతిని చూస్తూ... ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండా తనను అదోలా చూస్తూ...

''ఏంటత్తయ్యా? ఇలాగేనా? పిల్లల్ని చూసుకునేది? ఆ తగిలిన దెబ్బేదో ఇంకా కొంచెం గట్టిగా తగిలుంటే? వాడి బతుకు ఏమయ్యేది? మిమ్మల్నేమైనా బజారుకెళ్లమన్నామా? బరువులెత్తమన్నమా? బాబును చూసుకోమన్నాం. అంతేగా? అది కూడా చేతకాకపోతే ఎందుకు ఇంత వయసొచ్చి?''

రమ్య వాయిస్‌లో తొంగి చూసిన కోపాని కన్నా చిన్న విషయాన్ని పెద్దదిగా చేస్తూ తన వయసు గురించి చేసిన కామెంట్‌కు కన్నీళ్ల పర్యంతమైంది.

''బాత్‌రూం కెళ్లొచ్చేలోగానే... మెట్ల మీద నుంచి జారి...'' జయంతి సమాధానం పూర్తి కాకుండానే...

'మెయిన్ డోర్ మూసేసి వెళ్లొచ్చుగా..?'' చిటపటలాడింది రమ్య




''పొద్దుటి నుంచి కరెంట్ లేదు. ఆ తలుపు మూసేస్తే గాలిరాక....''

వాడు చస్తాడా? మీరు చస్తారా? ఛీ...మాటకు మాట '' రమ్య మాటలకు, చీదరింపుకు నిశ్చేష్టురాలైపోయింది తను.

''రమ్య ! ఏమైనా అనదల్చుకుంటే నన్ను అను గానీ. పసివాడు బాబీని అంతమాటంటావా?''

''ఏమ్మా? నా బాబును అంటేనే నీకింత బాధ కలిగిందే... వాడికి దెబ్బ తగిలితే నాకెంత బాధకలగాలి?''

మౌనం కన్నా మరో మార్గం లేదని అర్థమైపోయింది.

''ఇదొకటి నేర్చుకున్నారు. బెల్లం కొట్టిన రాయిలా నిలబడిపోవడం. బాబును చూస్తే విశాల్ ఎంత రాద్ధాంతం చేస్తాడో?''

రమ్య గోరంత విషయాన్ని కొండంత చేయబోతోందని అర్థమైపోయింది.

రెండే రెండు మెట్లు మీద నుంచి దొర్లిపోయిన బాబీకి చేతి మీద చిన్నగా గీరుకుపోయింది. కనీసం ఏడవను కూడా ఏడవకుండా ఆయింట్‌మెంట్ రాయగానే హాయిగా నిద్రపోయాడు. అంత చిన్న విషయాన్ని చిలవలు పలవలుగా చిత్రీకరించడం కోసం ప్రయత్నం చేస్తున్న రమ్య మనోగతం అవగతమైపోయింది.

రెండు రోజుల క్రితం జరిగిన విషయం గుర్తొకొచ్చింది. 'ఆ రోజు ఆఫీసు నుంచి వస్తూనే... ముఖమంతా నవ్వు పులుముకుని పావుకిలో స్వీట్ ప్యాకెట్‌ను' తన చేతిలో పెట్టింది రమ్య.

ఆ నవ్వును, స్వీట్ ప్యాకెట్ ను చూస్తూనే తన మనసెందుకో కీడును శంకించింది.

'మా చెల్లి సౌమ్య మ్యారేజ్ ఫిక్స్ అయింది. డాడీ ఫోన్ చేసారత్తయ్యా.'

వెలిగిపోతున్న ముఖంతో చెప్పిన రమ్యను కష్టపెట్టలేక ప్యాకెట్ లోంచి చిన్న ముక్కను తీసుకొని... ఏదైనా అనాలని..

'సంతోషం రమ్యా! ఆ శుభకార్యం కూడా అయిపోతే... మీ నాన్నగారికి బరువు తీరిపోతుంది' అంది తను

ఆ... అంత సీనేమీలేదు లెండి. ఇప్పుడో ఐదు లక్షలు వుంటే తప్ప అయ్యేలా లేదట డాడీకి రావాల్సిన బాకీలు మరో మూడు నెలలుదాకా తిరిగి రావట. ఏం చేయాలో అర్థం కాక నాకు ఫోన్ చేశారు.

'ఆ పెట్టుకునే ముహుర్తాలేవో మరో మూడు నెలలాగి పెట్టుకుంటే సరిపోతుందిగా'

''ఆc... అంత కాలం వాళ్లు ఆగొద్దూ? మంచి సంబంధమట. అబ్బాయికి స్టేట్స్ వెళ్లే అవకాశం కూడా వుందట.''

''విశాల్‌కి చెప్పలేకపోయావా? వాడెక్కడైనా ట్రై చేస్తాడేమో?''

ఆయన కిందాకే ఫోన్ చేశాను. అంత మొత్తం తన వల్ల కాదన్నారు.

''పోనీ నువ్వూ... వాడు లోన్‌కు అప్లయ్ చేయొచ్చు కదా?''

''మా లోన్ ఫెసిలిటీ వాడేసి ప్లాటొకటి కొన్నాం.'' నోరు జారానని గ్రహించిన రమ్య,... ''ఆ లోన్‌కు అప్లయ్ చేసినా అంతరాదు. మహా అయితే ఒకటి రెండు లక్షలు అంతే....''

'పోనీ ప్లాట్ అమ్మేసి మీ నాన్నకు సాయం చేయండి. ఈ మధ్య భూమి ధరలు బాగా పెరిగిపోయాయి కదా?'

తన సలహా నచ్చలేదని అర్థమైపోయింది. ముఖమంతా వికృతంగాపెట్టి ''ప్లాటు పేరెత్తితే పళ్లు రాలగొడతానన్నాడు మీ అబ్బాయి'' వ్యంగ్యంగా అంది.

''అయితే వాడే ఏదో చేస్తాడులే.. నువ్వేమీ వర్రీ అవకు.''

తన సలహా నచ్చలేదని మూడు వంకర్లు తిరిగిన మూతే చెప్పింది.

అప్పుడే వచ్చిన విశాల్ విషయమంతా అర్థమైపోయినట్లు మౌనంగా లోపలకి వెళ్లబోతుంటే...

'ఏయ్ విశాల్! మీ అమ్మదో అంటోంది. విను' విషయాన్ని అటో ఇటో తేల్చేయాలనే పట్టుదల కనిపించింది రమ్య మాటల్లో.

ఎందుకో చిరాగ్గా వున్న విశాల్. విషయమేమిటో తెలుసుకోకుండానే 'అబ్బా! మీ ఇద్దరి మధ్యా నేను చస్తున్నాను. అసలింతకీ ఏంటమ్మా గోల?'

విసుగ్గా ముఖం పెట్టి ముద్దాయిని అడిగినట్లు అడిగాడు. తనేం గోల చేసిందో అర్థకాక తను మౌనంగా వుండిపోయింది.

'అదే... మన ప్లాటు అమ్మేసి మా చెల్లెలి పెళ్లికి హెల్ప్ చేయమని మీ అమ్మ...'

'రమ్యా! నీకు ఆల్రెడీ చెప్పాను. ప్లాటు గురించి...డిస్కషన్ వద్దని... అర్థమైందా?'

'మరి డాడీ ఫోన్ చేస్తే ఏం చెప్పమంటావ్?'

చూద్దాం.. మా మమ్మీ ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి... ఏమ్మా... నువ్వేమంటావ్?

అదేదో చాలా చిన్న విషయమన్నట్లు మాట్లాడుతున్న విశాల్‌ను చూస్తుంటే మనసు చివుక్కుమంది.

''కావాలంటే ఇంట్రస్ట్ కూడా ఇస్తారు మా డాడీ.''

భర్తకు వత్తాసు పలికింది రమ్య.

'సారీ విశాల్...సారీ... మరేదైనా మార్గం చూసుకోండి'

ఇద్దరికి మింగుడు పడని తన సమాధానమే ఇంత రాద్ధాంతానికి దారితీస్తోంది.

అప్పటి నుండి విసుగూ, కోపాల్ని మేళవించి ఈసడించి మాట్లాడడం మొదలు పెట్టింది రమ్య.

అంటీ ముట్టనట్లుగా తప్పంతా తనదే అన్నట్లు తప్పుకు తిరుగుతున్నాడు విశాల్.

అలా అలా చినికి చినికి ఇప్పుడు 'బాబీ ఇష్యూతో' గాలివానగా మారబోతోందని అర్థమైపోయింది తనకి.

ఆ రాత్రి ఏం చెప్పిందో? ఎలా మేనేజ్ చేసిందో...

బ్రేక్‌ఫాస్ట్ చేస్తూండగానే మొదలుపెట్టాడు విశాల్.

''అమ్మా! నీకు మాతో కలిసుండడం కష్టంగా వున్నట్లుంది. బాబీగాడితో కూడా ట్రబుల్స్ ఫేస్ చేస్తున్నట్లున్నావ్. ఇక రమ్యతో గొడవపడని రోజంటూ లేదు. అందుకే... అందుకే...నేనో నిర్ణయానికి వచ్చాను.'' తన ముఖం చూడలేక టిఫిన్ ప్లేటునే చూస్తూ తప్పంతా తనదే అన్నట్లు మాట్లా

డుతున్న విశాల్ మాటల్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటే...


"నా ఫ్రెండ్ వాళ్ల మదర్... హోమ్ ఫర్ ఏజ్డ్ రీసెంటుగా స్టార్ట్ చేశారు అందులో నిన్ను...."

"ఔనంట విశాల్. చాలా డీసెంట్‌గా వుందట కూడా"

ఆ ఇద్దరి మాటలకు సమాధానం చెప్పాలనిపించలేదు. మౌనంగా వుండిపోయింది తను.

భార్య ప్రభావం భర్తమీద... భర్త ప్రభావం భార్య మీద వుండడం అతి సహజం.

ప్రాణానికి ప్రాణంగా పెంచిన తల్లి మనసును అర్థం చేసుకోకుండా కేవలం భార్య తృప్తి కోసం నిర్ధాక్షణ్యంగా తల్లి స్థానాన్ని విస్మరించి హోమ్‌లో చేర్పిస్తానంటున్న కొడుకును చూస్తుంటే ఆమెకి దుఃఖం ఆగలేదు. ఏం చేయాలో అర్థంకాక.. బిగపట్టుకుంది. దాదాపు నాలుగైదు సార్లు ఆ విషయం గురించి గొడవలు జరిగాక యల్టీసీ మీద మనాలీ వెళ్లారు.




మాట వరసకు కూడా వస్తావా అమ్మా? అని కూడా అడగలేదు. ఒక వేళ పిలిచినా తనెళ్లుండేది కాదు.

***

జ్ఞాపకాల సుడిగుండం లోంచి బయటపడింది 'జయంతి'. కన్నీటి ధారలను పైట చెంగుతో అద్దింది. నెమ్మదిగా లేచి తన ప్రియమైన రైటింగ్ టేబుల్ ముందు కూర్చుని డ్రాయర్ లాగి ఫ్యామిలీ ఫోటో ఆల్బంను చేతుల్లోకి తీసుకుంటే గతం గమ్యాన్ని చేరినట్లు మెదడు పొరల్లోకి చొచ్చుకొచ్చేసింది.

వ్యసనపరుడైన భర్త మరణంతో అతను పనిచేసిన కాలేజీ మేనేజ్‌మెంటు తన క్వాలిఫికేషన్‌కు తగినట్లు అటెండర్ పోస్ట్ ఇచ్చారు. పిల్లల పెంపకంతో పాటు పుస్తకాలతో కూడా కుస్తీ పట్టి పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసి అదే కాలేజీలో లెక్చరర్‌గా ప్రమోషన్ పొందింది. పిల్లలు పెద్దవాళ్లయిపోయి తమకు తామే తమ జీవిత గమ్యాల్ని నిర్ణయించుకొని లవ్ మ్యారేజ్‌లు చేసుకొని ఇన్ఫర్మేషన్ ఇవ్వడానికి మాత్రం ఇంటికొచ్చిన సంఘటనలు గుండెల్ని పిండేస్తే సమాజంలో భర్త లేని స్త్రీ ఒంటరిగా పోరాటం చేయడమెంత అసిధారావ్రతమో... అడుగడుగునా అవగతమైంది.

భర్త మరణంతో వచ్చిన సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి భద్రంగా కాపాడుకోవడం కోసం అందరికీ దూరమైంది.

అప్పటి దాకా కన్నెత్తి చూడని బంధుజనాలు పిండాల కోసం వాలిపోయే కాకుల్లా మూగిపోయారు.

వాళ్లందరి బారి నుంచి పిల్లల్ని, ఆ ఇంటిని, ఆ కొద్దిపాటి ధనాన్ని కాపాడుకోవడంలో 'స్పందన లేని బండరాయి' అనే బిరుదును మాత్రం పొందగలిగింది.

తినీ...తినక ఇద్దరబ్బాయిల్ని ఇంజనీరింగు.చదివించింది.

పెద్దబ్బాయి రవి బొంబాయిలో సెటిలైపోయి ఓ గుజరాతీ అమ్మాయిని లవ్‌మ్యారేజ్ చేసుకొని అయిదేళ్లలో ఒక్కసారి మాత్రం వచ్చాడు. అదీ ఒంటరిగా...

రెండో వాడు రమ్యను లవ్‌చేసి వివాహమాడి అత్తగారింట్లో మకాం పెట్టి అత్తింటి అమర్యాదలకు తట్టుకోలేక తనతోనే వుంటానని వచ్చేసాడు.

భర్తను కోల్పోయిన తనకు రెండో వివాహం గురించి ఎవరెంత చెప్పినా పిల్లలకు అన్యాయం చేయకూడదనే ఏకైక లక్ష్యంతో స్పందనలను చంపుకొని బండరాయిలా మిగిలిపోయింది. తను మానసికంగా, శారీరకంగా ఇతరులకు సేవ చేయగలిగే స్థితిలో వుందిప్పుడు. ఆర్థికంగానైతే వచ్చే పెన్షన్‌తో మరో కుటుంబాన్ని పోషించగలిగే స్థాయి. ఇంతవరకూ కొడుకుల నుంచి చీరను కూడా ఆశించలేదు. అలాంటి తను... తనయునికి భారమైపోయింది. దూరం చేసుకుంటే తప్ప భారం తీరదనుకుంటున్నాడు కన్నకొడుకు. 'యస్ వాడి కోరికే తీర్చాలి. తీరుస్తాను.' పరిష్కారం లభించిందన్న తృప్తితో ఆల్బం పక్కన పెట్టి పెన్నూ, పేపరు తీసుకొంది జయంతి.

***

ఆటో దిగిన విశాల్ దంపతులకు డోరుకున్న లాక్ ఆహ్వానం పలికితే. గేటుకు వేలాడుతున్న 'టులెట్' బోర్డు షాక్ కొట్టింది. పక్కింటి పిన్నిగారు ఇచ్చిన కీస్ తీసుకొని లోపలికెళ్లి డైనింగ్ టేబుల్ మీద రెపరెపలాడుతున్న లెటర్ని వణికే చేతుల్తో తీసుకొని చదివి. పాలిపోయిన ముఖంతో భార్యకు అందించాడు. ఆమె కళ్లు అక్షరాల వెంట పరుగెత్తాయి.

"ప్రియమైన విశాల్!"

నువ్వన్నట్లు ఈ వయసులో బాబీని చూసుకోవడం కష్టంగానే వుంది. నేను మీతో కలిసుండడం నాకన్నా మీకే ఇబ్బందిగా వుంటోందని గ్రహించాను. కోడలితో ప్రతిరోజూ గొడవ తప్పడం లేదు. వయసు రాగానే సరికాదు. వయసుకు తగ్గట్లు ప్రవర్తించమని నీ భార్య నా కర్తవ్యాన్ని నాకు గుర్తు చేసింది.

ఎంత విశ్వాసంతో సేవ చేసినా... తను చివరకు చేరేది 'కబేళాకే'ననే సత్యం తెలియని గానుగెద్దు ఆ వలయంలో అలా తిరుగుతూనే వుంటుంది. అలాగే నేను కూడా ఇంతకాలం మీరంతా 'నా వాళ్లని' భ్రమిస్తూ... 'గానుగెద్దు'లాగే బ్రతికాను.

ఎంత త్యాగం చేసిన తల్లినైనా చివరకు చేర్చేది హోమ్‌లకేననే ఈతరం కొడుకుల సెంటిమెంటును చాలా చక్కగా వ్యక్తం చేసావు.

రేపు నీ కొడుకు నిన్నెక్కడకు చేరుస్తాడో? అయినా ఇంకా టైముందనుకో! నేను నీకు అవసరం లేనప్పుడు నువ్వు మాత్రం నాకెందుకు? నీకు లేని మమతానురాగాలు నాకు మాత్రం ఎందుకు? నన్ను హోమ్ ఫర్ ఏజ్డ్‌లో చేరుస్తానన్నావే. నీకాశ్రమ ఎందుకు? నా హోమ్‌నే ఏజ్డ్ వాళ్లకు హోంగా మార్చేస్తున్నాను. నాతో పాటు మరో పదిమందికి నీడనిద్దామని.

మీరింతకు ముందులా ఇక్కడే వుండాలనుకుంటే.. 'అద్దె' చెల్లించి వుండొచ్చు. మీరిచ్చే ఆ అయిదువేలూ ఓ అయిదుగురు అనాథలకు చదువునిస్తుంది. ఆ ఇంట్లోనే ఓ క్రెష్‌ను కూడా నడపదలుచుకొన్నాను. అయిదొందల ఫీజుతో మీరు బాబీని అందులో చేర్పించవచ్చు. ఆ అయిదొందలూ నాలాంటి ఓ అమ్మకు ఆకలి తీరుస్తాయి కదా?

మీకు సమ్మతమైతే సరే..లేదంటే ఇల్లు ఖాళీ చేసేసి.. తాళాలు పిన్నిగారింట్లో ఇవ్వండి. మరి వుంటాను."

నీ అనాథ తల్లి

***

అమ్మో! రేపట్నుంచి అద్దె కట్టాలన్న ఆలోచనో... 'బాబీ'కి దిక్కెవరన్న భావనో అన్యాయంగా అత్తయ్యను దూరం చేసుకున్నానన్న ఫీలింగో మొత్తానికి రమ్య కళ్లు కన్నీటి చెరువులయ్యాయి. భర్త ముఖాన్ని చూడాలని తలెత్తిన రమ్యకు తల దించుకున్న భర్త కనిపించాడు.

★